క్లుప్తంగా

ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు



ఉత్సవ విగ్రహాలకు అభిషేకం చేస్తున్న బ్రాహ్మణులు, భక్తులు

ఇబ్రహీంపట్నం: దండుమైలారం ప్రాచీన శివాలయంలో సోమవారం శ్రీ పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు రావినూతల వంశీదర్, ఆలయ రాజపోషకుడు తాడూరి జనార్దన్‌రెడ్డిల ఆధ్వర్యంలో మహా గణపతిపూజ, అఖండ దీపారాధన, పుణ్యాహవచనం, రుద్రాభిషేకం, మహా పూర్ణాహుతి, విగ్రహ ప్రతిష్ఠ, మహా హారతి తదితర పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో చిలకమర్రి లక్ష్మీనాథచార్యులు, చక్రవర్తుల మధన్ మోహనచార్యులు, ప్రవచన కర్త కవీంద్రచార్యులు, రావినూతల శ్రవణ్‌కుమార్, రోహిత్‌కుమార్, తాడూరి వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సైన్స్ ఫెయిర్



నాడీవ్యవస్థపై రూపొందించిన ఆవిష్కరణను ఆసక్తిగా చూస్తున్న విద్యార్థులు

ఆమనగల్లు: పట్టణంలోని లిటిల్‌స్కాలర్స్ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్ ఎంతగానో ఆకట్టుకుంది. విద్యార్థులు తమ ప్రతిభతో రూపొందించిన ఆవిష్కరణలు విద్యార్థుల మేధాశక్తిని ప్రతిబింబించాయి. ఫిజిక్స్, బయోసైన్స్, సోషల్, గణితంలో 90 ప్రయోగాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్, ఎంఈఓ పాండులు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సుజాతారెడ్డి, అకాడమిక్ అడ్వైజర్ సుదర్శన్ రెడ్డి, చైర్మన్ అల్లాజీగౌడ్, డైరెక్టర్ సావిత్రి, ప్రిన్సిపాల్ శ్రీశైలం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వంశీచంద్‌రెడ్డికి కాంగ్రెస్ నేతల సన్మానం



వంశీచంద్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీ కేంద్ర ఎన్నికల నిపుణుల కమిటీ సభ్యుడిగా నియమితులైన సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు వంశీచంద్ రెడ్డిని ఆ పార్టీ నాయకులు సోమవారం ఆమనగల్లు పట్టణంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో చల్లా మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ఆ పార్టీ ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల అధ్యక్షులు జగన్, బిచ్యానాయక్, ప్రభాకర్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, మార్కెట్ డైరెక్టర్లు అజీం, శ్రీశైలం, నాయకులు రవీందర్ యాదవ్, రవి, హీరాసింగ్, షాబుద్దీన్, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పూర్తి చేయాలి



సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్

తుర్కయంజాల్: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను వేగవంతంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రాగన్నగూడ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తుల విషయంలో నిర్లక్ష్యం చేయరాదని చెప్పారు. 100 శాతం పన్ను వసూలే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. టౌన్‌ప్లానింగ్ అధికారి దినేష్, ఆర్.ఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మహేశ్వరం: మండల పరిధిలోని గంగారం పంచాయతీ మైలార్‌బాయి తండాకు చెందిన మునావత్ లచ్చిరామ్‌నాయక్ సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం మాజీ సర్పంచ్ ఎం.సాలీవీరానాయక్ రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

ఏళ్లుగా.. ఎదురుచూపులే

అటకెక్కిన బైపాస్ బీటీరోడ్డు హామీ
- మట్టిరోడ్డుతో వాహనదారుల అవస్థలు
- రోడ్డుకు ఇరువైపులా వ్యర్థాల పారబోత
- పట్టించుకోని పాలకులు



ఇబ్రహీంపట్నం నుంచి కోహెడ క్రాస్ రోడ్డు వరకు వెళ్లే బైపాస్ మట్టి రోడ్డు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం టౌన్ సమీపానికి దగ్గరగా నాగార్జునసాగర్ నుంచి హైదరాబాద్ ప్రజల తాగునీటి అవసరాల కోసం వేసిన కృష్ణా జలాల పైపులైన్ మట్టి రోడ్డు(బైపాస్) అభివృద్ధికి నోచుకోవడం లేదు. సుమారు పదిహేన్నేళ్లుగా ఇదిగో బీటీరోడ్డు అంటూ పాలకులు హామీ ఇస్తున్నా.. అమలుకు నోచుకోవడం లేదు. దీనికి తోడు రహదారికి ఇరువైపులా వ్యర్థాల పారబోతతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. వెరసి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

వెలుస్తున్న కాలనీలు

ఈ మార్గంలో హైదారాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ శాఖ ప్రత్యేక రోడ్డును వేసి మూడు పైపులైన్ల ద్వారా కృష్ణా జలాలను నగరానికి తరలిస్తోంది. ఈ రోడ్డు ఇబ్రహీంపట్నం సమీపం నుంచి కోహెడ క్రాస్ రోడ్డు వద్ద సాగర్ హైవేకు కలుస్తుండటంతో బైపాస్‌గా గుర్తింపు పొందింది. సుమారు ఏడు కిలో మీటర్ల మేర ఈ కంకరతో నిర్మించిన మట్టి రోడ్డులో పట్నం టౌన్‌లోకి రాకుండా నాగన్‌పల్లి, ఖానాపూర్, పొల్కంపల్లి, దండుమైలారం, ముకునూర్, మంచాల మండలంలోని వివిధ గ్రామాల నుంచి నిత్యం ప్రయాణం సాగించేవారికి ఈ లింకు రోడ్డుగా ఎంతో ఉపయోగపడుతుంది. ఈ రోడ్డుకు ఇరువైపులా అనేక కాలనీలు వెలుస్తున్నాయి. పట్టణంలో ఏమైనా ఆందోళన కార్యక్రమాలు జరుగుతున్నప్పుడు వాహనాలను ఈ దారి గుండా మళ్లిస్తుంటారు.

కార్యరూపం ఎప్పుడో?

బైపాస్ రోడ్డు గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. బీఆర్ఎస్ హయాంలో ఈ మార్గాన్ని బీటీగా మారుస్తామని హామీ ఇచ్చినప్పటికీ.. నెరవేర్చలేదు. ప్రస్తుత ప్రభుత్వం దృష్టి సారించి మట్టి రోడ్డును బీటీగా మార్చితే రవాణా మార్గం మెరుగుపడనుంది. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి బీటీరోడ్డుగా మారుస్తామని ఇటీవల ప్రకటించారు. కానీ కార్యరూపం ఎప్పుడు దాల్చుతుందో తెలియదు.

డంప్‌యార్డుగా..

బైపాస్ పొడవునా చెతాచెదారం కుప్పలు దర్శనమిస్తున్నాయి. పట్టణంలోని మాంసం దుకాణాలు, హోటళ్లు తదితర వ్యాపార సముదాయాల నిర్వాహకులు వ్యర్థాలను ఇక్కడ పారబోస్తుంటారు. స్థానికులు కూడా చెత్త వేస్తుంటారు. పారిశుద్ధ్య సిబ్బంది పట్టించుకోవడం లేదు. దీంతో ఈ మార్గం గుండా వెళ్లాలంటే అందరూ ఇబ్బంది పడుతున్నారు.



ఇబ్రహీంపట్నం బైపాస్ రోడ్డు పక్కన వ్యర్థపదార్థాలు, చెత్తాచెదారం

బీటీగా మారిస్తే మేలు



బైపాస్ మట్టిరోడ్డును బీటీగా మార్చితే ఇబ్రహీంపట్నం ప్రధాన రోడ్డులో ట్రాఫిక్ కష్టాలు తీరుతాయి. పరిసర ప్రాంత గ్రామాల వారికే కాకుండా నాగార్జునసాగర్- హైదరాబాద్ దారిలో పరుగులు తీసే వాహనాలకు సైతం ఉపయోగకరంగా ఉంటుంది. పాలకులు, అధికారులు ఈ దిశగా ఆలోచించాలి.

– రాజునాయక్, మానవ హక్కుల వేదిక జిల్లా కన్వీనర్

నరక ప్రయాణం



బైపాస్ వెంట ప్రయాణం చేయాలంటే నరకంగా ఉంది. ఇబ్రహీంపట్నం నుంచి వినోబానగర్ విద్యాసంస్థల వరకు ఆటో నడుపుతుంటాను. ఈ రోడ్డు అభివృద్ధి చేస్తే ఇబ్రహీంపట్నం టౌన్, పాత బస్తీ, పాత బస్టాండ్ ప్రధాన రహదారులతో సంబంధం లేకుండా మంచాల మార్గం గుండా పట్నం కొత్త బస్టాండ్‌కు చేరుకునే అవకాశం ఉంది.

– నాగిళ్ల అశోక్, ఇబ్రహీంపట్నం

ఎమ్మెల్యే సహకారంతో..



బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం తొలి విడతగా రూ.2 కోట్లు కేటాయించనుంది. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో ప్రణాళిక రూపుదిద్దుకుంటోంది. త్వరలో టెండర్ల ప్రక్రియ చేపట్టనున్నారు. అవసరమైతే మరో దఫా నిధులు కేటాయించి, రహదారిని అభివృద్ధి పరుస్తాం.

– గురునాథ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్, ఇబ్రహీంపట్నం

చెత్తను తొలగిస్తాం



దారి పొడవునా కుప్పలుగా పేరుకుపోతున్న చెత్తాచెదారం, వ్యర్థ పదార్థాలను తొలగింపచేస్తాం. పందులను వాటి సంరక్షకులతో మాట్లాడి, మరో ప్రాంతానికి తరలిస్తాం. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాం. బైపాస్‌లో చెత్తను పారబోస్తే జరిమానా విధిస్తాం.

– రవీంద్రసాగర్, మున్సిపల్ కమిషనర్, ఇబ్రహీంపట్నం

ఎమ్మెల్యేను కలిసిన అధికారులు



ఎమ్మెల్యే కసిరెడ్డికి పూలమొక్కను అందజేస్తున్న అధికారులు

ఆమనగల్లు: కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని వ్యవసాయశాఖ సబ్ డివిజన్ ఏడీ శోభారాణి మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆమె నగరంలోని ఆయన నివాసంలో సోమవారం కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి, సేవలు అందించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను సక్రమంగా అందించేలా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాల వ్యవసాయ అధికారులు శ్రీనివాస్‌గౌడ్, అరుణకుమారి, రేణుకాచక్రవర్తి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

నిందితులపై చర్యలకు డిమాండ్



నిరసన వ్యక్తంచేస్తున్న బీజేపీ నాయకులు

కడ్తాల్: మండల పరిధి చిన్నవేములోని బావితండాలో ఈ నెల 22న ఆంజనేయస్వామి విగ్రహాన్ని తొలగించి, ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆ విగ్రహాన్ని ఆలయంలో ప్రతిష్ఠించి పూజలు చేశారు. అనంతరం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నిందితులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసి 48 గంటలు గడిచినా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. దుండగులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మహేశ్, నాయకులు శంకర్‌నాయక్, పత్యానాయక్, మునేశ్, వినోద్, అఖిల్, లాలు, రాజు, దశరథ్, అరవింద్, రవీందర్ తదితరులు ఉన్నారు.

బస్టాప్ ఏర్పాటు చేయాలని వినతి

కడ్తాల్: శ్రీశైలం- హైదరాబాద్ జాతీయ రహదారిపై మండల పరిధి కర్కల్‌పహాడ్ గ్రామంలో ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాప్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం కల్వకుర్తి ఆర్టీసీ డిపో మేనేజర్ సుభాషిణికి వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన ఆమె.. రెండు మూడు రోజుల్లో గ్రామంలో బస్సులు నిలిపే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని గ్రామస్తులు తెలిపారు. త్వరలోనే బస్టాప్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నట్లు వెల్లడించారు. సందర్భంగా గ్రామస్తులు డిపో మేనేజర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కృష్ణయ్య, రాజు, పురుషోత్తం, నరేందర్, కంచుగట్ల రాజు, బీ.రాజు, రమేశ్, జలాలుద్దీన్, రాజ్‌కుమార్, శివకుమార్ తదితరులు ఉన్నారు.

నూతన నియామకం



మల్లేశ్‌ను సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు

యాచారం: ఎమ్మార్పీఎస్ మాదిగ ఉద్యోగస్తుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా గునుగల్ గ్రామానికి చెందిన కుంటి మల్లేశ్ ఎన్నికయ్యారు. సోమవారం సంఘం ప్రతినిధుల సమావేశంలో నియమించారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ.. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ నాయకత్వంలో ఎస్సీ రిజర్వేషన్, ఏబీసీడీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం నూతన అధ్యక్షుడిని సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంద దేవేంద్రప్రసాద్, జాతీయ నాయకుడు అయోధ్య, సీనియర్ నాయకులు గడ్డం యాదయ్య, శ్రీపతి నరసయ్య, గోపాలకృష్ణ గోకులే, కాటపాక సురేందర్, జానీ, యాదగిరి పాల్గొన్నారు.

ఉప్పల ట్రస్టు ఉదారత

రూ.2 కోట్లతో శివాలయం నిర్మాణం



ఆలయంలో పూజలు చేస్తున్న దాత వెంకటేశ్ దంపతులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండల కేంద్రంలో ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ సొంత నిధులు రూ.2 కోట్ల వ్యయంతో పాత శివాలయాన్ని పునర్నిర్మించారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈ నెల 26న ఆలయాన్ని ప్రారంభించనున్నారు. కార్యక్రమానికి నాగసాధువులు రానున్నారు. ఈ సందర్భంగా సోమవారం వెంకటేశ్, మంజుల దంపతుల ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఇదిలా ఉండగా.. స్థానికుల కోరిక మేరకు పురాతన ఆలయాన్ని ఏడాది కాలంగా ఆయన రూ.2 కోట్లతో పునర్నిర్మించారు. భారీ శివుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఆలయ ప్రారంభం రోజున శృతిలయ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని మాజీ ఎంపీపీ నిర్మల, ట్రస్టు చైర్మన్ బుచ్చిబాబులు కోరారు.

ఎమ్మెల్సీని కలిసిన భూ బాధితులు

యాచారం: కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను సోమవారం నగరంలోని ఆయన నివాసంలో ఫార్మాసిటీ భూ బాధితులు కలిశారు. బీఆర్ఎస్ హయాంలో టీజీఐఐసీ పేరు మీద మార్చిన భూ రికార్డులను, రైతుల పేరిట మారుస్తామని, ఫార్మాసిటీకి భూములు తీసుకోమని ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. కానీ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడిచినా రైతుల సమస్యలను పట్టించుకునే వారే లేరని పేర్కొన్నారు. దీనికి స్పందించిన మల్లన్న.. రెవెన్యూ ఉన్నతాధికారులకు ఫోన్ చేసి, టీజీఐఐసీ పేరు తీసేసి, పట్టా భూముల రికార్డుల్లో రైతుల పేర్లు నమోదు చేయాలని సూచించారు. ఆథారిటీలో కేసు నడుస్తున్న నేపథ్యంలో న్యాయపరమైన చిక్కులొస్తున్నాయని అధికారులు ఎమ్మెల్సీకి తెలిపారని రైతులు పేర్కొన్నారు. కార్యక్రమంలో నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల రైతులు పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిస కావొద్దు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ కృష్ణంరాజు

యాచారం: యువత చేడు వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు సూచించారు. పీఎస్ పరిధి బెగరికంచెలో సోమవారం సాయంత్రం ప్రజలతో అవగాహన సదస్సు నిర్వహించారు. గంజాయి, డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్ వంటి చేడు వ్యసనాలకు లోనుకావద్దని చెప్పారు. గ్రామాల్లో చోరీలు, కొత్త వ్యక్తుల సంచారంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎస్ఐ తేజంరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్ టీచర్‌ను నియమించాలని వినతి

నియామకంపై డీఈఓకు ఆదేశాలు జారీచేసిన కలెక్టర్



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామ యువకులు

మహేశ్వరం: మండల పరిధిలోని తుమ్మలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సైన్స్ టీచర్‌ను నియమించాలని గ్రామ యువకులు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. తుమ్మలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు నెలల నుంచి సైన్స్ టీచర్ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నా సైన్స్ టీచర్ లేక పాఠాలు సక్రమంగా జరకపోవడంతో ఆ సబ్జెక్టులో విద్యార్థులు పూర్తిగా వెనకబడిపోతున్నారన్నారు. పాఠశాలకు సైన్స్ టీచర్‌ను నియమించాలని పలుమార్లు ఎంఈఓ, డీఈఓలకు విన్నవించిన ప్రయోజనం లేదని గ్రామ యువకులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సైన్స్ టీచర్‌ను నియమించాలని కోరారు. ఈ విషయంపై కలెక్టర్ డీఈఓతో మాట్లాడి పాఠశాలకు సైన్స్ టీచర్‌ను నియమించాలని ఆదేశించారు. సమస్య పరిష్కారం చేసినందుకు జిల్లా కలెక్టర్‌కు గ్రామ యువకులు, విద్యార్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో గ్రామ యువకులు కటికెల యాదగిరి, కళ్యాణ్‌రెడ్డి, కార్తీక్ పలువురు పాల్గొన్నారు.

నేటి నుంచి మైసిగండి బ్రహ్మోత్సవాలు

- 26న శివపార్వతుల కల్యాణం
- ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



శివాలయం(ఇన్‌సెట్లో) కొలువైన కాశీ విశ్వనాథుడు

కడ్తాల్: కాశీవిశ్వనాథస్వామి బ్రహ్మోత్సవాలకు కడ్తాల్ మండలం మైసిగండి శివాలయం ముస్తాబైంది. ఏటా మహా శివరాత్రిని పురస్కరించుకుని ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా నేటి నుంచి 27వ తేది వరకు బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగనున్నాయి. సాంప్రదాయంగా జపహోమ పూజలు, అభిషేక అర్చనాది సేవలను ఆగమ శాస్త్రానుసారంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఉత్సవ వివరాలు

25న విఘ్నేశ్వరపూజ, ధ్వజారోహణం, స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం. 26న శివపార్వతుల కల్యాణం, రాత్రి 12 గంటలకు ప్రత్యేక అభిషేకాలు, తదుపరి స్వామివారికి రథోత్సవం. 27న స్వామివారికి ఏకాదశ కలశాభిషేకం, వసంతోత్సవం అవబృతం, పూర్ణాహుతి కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ఈఓ స్నేహలత, ట్రస్టీ శిరోలి తెలిపారు.

ప్రత్యేక ఏర్పాట్లు




బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. తాగునీటి తదితర వసతులు సిద్ధం చేశాం. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో నిత్యం నవగ్రహ హోమం, గణపతి హోమం నిర్వహిస్తాం.

– శిరోలి, ఆలయ ట్రస్టీ, మైసిగండి, మైసమ్మ శివరామాలయాలు

ఆలయ చరిత్ర

మైసిగండి శివాలయ రామాలయ దేవాలయాలు.. ఋగ్వేద కాలంలో గంగా గుళ్లుగా పిలువబడేవి. చరిత్ర కలిగిన ఆలయాలు గోల్కొండ నవాబుల కాలంలో అక్కన్న, మాదన్నలు మహామంత్రులుగా ఉన్న సమయంలో నిత్యం విశేష పూజలు జరిగేవి. తర్వాతి కాలంలో ఆ పురాతన ఆలయాలను పునర్నిమించడానికి ఆమనగల్లు మాజీ ఎంపీపీ, అప్పటి ఆలయ ట్రస్టీ ఆర్.పంతునాయక్ కృషి చేశారు. దాతలు, ప్రభుత్వ సహకారంతో అభివృద్ధి చేశారు. అలా 23 సంవత్సరాల క్రితం పునర్నిమించిన ఆలయం.. నేడు భక్తుల తాకిడితో దేదీప్యమానంగా వెలుగుతోంది. ఆలయ పరిసరాల్లో ఉన్న కోనేరులో పవిత్ర స్నానాలు ఆచరిస్తే రోగాలు, పాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం.



ఆలయ ఆవరణలో కోనేరు

నేడు విద్యుత్ సమస్యలపై సమీక్ష

తుర్కయంజాల్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి తుర్కయంజాల్ సబ్‌స్టేషన్ ఇబ్రహీంపట్నం డివిజన్ కార్యాలయంలో మంగళవారం వినియోగదారుల ఫిర్యాదుల విచారణ సమావేశం నిర్వహించనున్నట్లు డీఈ సురేష్ కుమార్, ఏఈ రవీందర్ రెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు చేపట్టనున్న సమీక్షలో సి.జి.ఆర్.ఎఫ్ చైర్ పర్సన్, మెంబర్ టెక్నికల్, మెంబర్ ఫైనాన్స్, మెంబర్ కన్స్యూమర్ ఎఫైర్స్ హాజరుకానున్నారని వారు పేర్కొన్నారు. ఇందులో వినియోగదారుల దీర్ఘకాలిక విద్యుత్ సమస్యలతో పాటు, బిల్లులో హెచ్చు తగ్గుల ఫిర్యాదులు పరిష్కారం పొందవచ్చని సూచించారు.

నోరు తెరిచిన మ్యాన్‌హోల్

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాం కాలనీలోని బృందావన్ కాలనీలో మ్యాన్‌హోల్‌కు పైకప్పు లేకపోవడంతో ప్రమాదకరంగా ఉంది. 17వ వార్డు పరిధిలోకి వచ్చే ప్రధాన రహదారిపై మ్యాన్‌హోల్ ఇలా నోరు తెరుచుకొని ఉండడంతో ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళనలు చెందుతున్నారు. చిన్నారులు అటుగా అందులో పడిపోయే ప్రమాదం ఉందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించి వెంటనే పైకప్పును ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రేపటి నుంచి మల్లన్న జాతర





కొండపై మల్లన్న ఆలయం (ఇన్‌సెట్లో) కొలువైన మల్లికార్జునుడు

ముస్తాబవుతున్న ఆలయం

కడ్తాల్: మండల పరిధి ఎక్వాయిపల్లి గ్రామ సమీపంలోని మల్లన్న గుట్టపై వెలసిన మల్లికార్జున స్వామి జాతర రేపటి నుంచి ప్రారంభం కానుంది. ఏటా శివరాత్రికి జాతర నిర్వహించడం ఆనవాయితీ. 26 నుంచి మార్చి 2 వరకు జరగనున్న జాతరకు కడ్తాల్, కల్వకుర్తి, ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, యాచారం, మాల్, చింతపల్లి, చరికొండ తదితర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారని ఆలయ ప్రధాన ధర్మకర్త ఎట్టయ్య యాదవ్ తెలిపారు.

జాతర వివరాలు

26న గణపతి పూజ అనంతరం పంచామృతంచే స్వామివారికి అభిషేకం, రాత్రికి శివ కల్యాణోత్సవం, ఒగ్గుకథ. 27న తెల్లవారు జామున అగ్నిగుండాల మహోత్సవం. 28న ప్రత్యేక పూజలు, రాత్రికి రథోత్సవం. మార్చి 1న ప్రత్యేక అర్చనలు, విశేష పూజలు, దోపోత్సవం, ఒగ్గుకథ. మార్చి 2న చక్రతీర్థం, ఒగ్గుకథతో జాతర ముగుస్తుందని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారిపై కర్కల్ పహాడ్ గేట్ నుంచి ముద్విన్ వెళ్లే రహదారికి 5 కిలో మీటర్ల దూరంలో మల్లన్న చెంతకు వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు పేర్కొన్నారు.